క్లుప్తంగా

నోట్‌బుక్కుల పంపిణీ

లింగాపూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శ్రీ నవశక్తి దుర్గామాత పీఠాధిపతి శ్రీశ్రీ కిషర్ మహారాజ్ ఆధ్వర్యంలో నడుస్తున్న నవశక్తి దుర్గామాత ట్రస్ట్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఎస్సై ప్రవీణ్, జాదవ్ రాజశేఖర్, ప్రశాంత్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే హరీశ్‌బాబు రాక

దహెగాం: సిర్పూర్(టి) నియోజకవర్గ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు బుధవారం మండలానికి రానున్నారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరు కానున్నారు. సర్పంచుల పదవీ కాలం ఈనెల 31తో ముగియనుండగా ఇదే వారికి చివరి సర్వసభ్య సమావేశం కానుంది. అధికారులు పూర్తి నివేదికలతో సమావేశానికి హాజరు కావాల్సిందిగా ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ సూచించారు.

కొనసాగుతున్న క్రీడా పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి ఎంపిక క్రీడా పోటీలు మంగళవారం హోరాహోరీగా కొనసాగాయి. జిల్లాలో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, రన్నింగ్, వాలీబాల్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నట్లు ఎంపీపీ మల్లికార్జున్ తెలిపారు. కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు తిరుపతి, కిరణ్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

తిర్యాణి: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గేడం టీకానంద్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో గిరిజన సంక్షేమ శాఖ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న కొంతమంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడంతో పాటు వారికి బదులుగా ప్రైవేట్ వ్యక్తులను విధులకు పంపిస్తున్నారని ఆరోపించారు. సదరు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోకపోతే తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సంఘం నాయకులు బోర్కుటే పార్థు, రేకల గణేశ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఘన సన్మానం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబును ఘనంగా సన్మానించారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని మున్నూరు కాపు సంఘం భవనంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్, ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోలెం వెంకటేశం, మాజీ కౌన్సిలర్ దెబ్బటి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఫాతిమా షేక్ జయంతి



నివాళులర్పిస్తున్న ఎంపీటీసీ

బెజ్జూర్: ఆధునిక భారత తొలి మహిళ ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలతో పాటు కేజీబీవీలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా జావిద్ పాల్గొన్నారు. ఫాతిమా షేక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: ముస్లిం మహిళ తొలి ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతిని విశ్రాంతి ఉద్యోగ సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలో సంఘ అధ్యక్షుడు జయదేవ అబ్రహం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

60 మంది ఉద్యోగులకు పదోన్నతి

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో ఒకే కేటగిరీలో ఎనిమిదేళ్లుగా పని చేస్తున్న 60 మంది ఉద్యోగులకు పదోన్నతులు లభించాయని పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులకు సంబంధించిన పదోన్నతి పత్రాలను ఉద్యోగులు పని చేసే గనులు, డిపార్టుమెంట్లకు పంపించినట్లు పేర్కొన్నారు.

నిల్వ పత్తి.. జాగ్రత్తలు తప్పనిసరి

- ధర లేక ఇంట్లో నిల్వ చేస్తున్న రైతులు
- జిల్లాలో పలు విషాదకర సంఘటనలు
- 3.35 లక్షల ఎకరాల్లో సాగు



ఇటీవల కాగజ్‌నగర్‌లో కాలిపోయిన పత్తి

కౌటాల: జిల్లాలోని రైతులు పత్తికి అనుకున్న ధర రావడం లేదని విక్రయించకుండా ఇంట్లోనే నిల్వ చేస్తున్నారు. ఈక్రమంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. తెల్లబంగారం పండిస్తే కష్టాలు దూరమవుతాయని భావించిన రైతులు పత్తి సాగు చేశారు. కానీ అనావృష్టి కారణంగా పెట్టుబడులు పెరిగినా పంట మాత్రం ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. ఉన్న పత్తిని అమ్ముదామంటే సరైన ధర లేక ధర పెరుగుతుందనే ఆశతో ఇంట్లోనే నిల్వ చేస్తున్నారు.

మద్దతు ధర కోసం..

జిల్లాలో ఖరీఫ్‌లో అత్యధికంగా 3,35,178 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. పత్తి ధర పెరుగుతుందనే ఆశతో రైతులు ఇళ్లలోనే నిల్వ ఉంచుతున్నారు. ఒకవేళ పత్తికి ధర పెరగకుంటే ఇంకా ఎన్ని రోజుల వరకు నిల్వ ఉంచాలో తెలియక, అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక సతమతమవుతున్నారు. క్వింటాల్ పత్తికి సీసీఐలో రూ. 7020 ఉండగా ప్రైవేట్‌లో దళారులు రూ. 6300లకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో కర్షకులు మద్దతు ధర కోసం వేచి చూస్తున్నారు. ఆరంభంలో మంచి ధర పలకడం.. అంతలోనే రోజురోజుకూ ధర పతనం కావడంతో ఆందోళనకు గురవుతున్నారు. అనుకున్న రేటు వచ్చినప్పుడే విక్రయించాలని చాలా మంది అన్నదాతలు ఇంట్లోనే పత్తి నిల్వ ఉంచుతున్నారు. ఇది కొందరి పాలిట శాపంగా మారుతోంది. సరైన అవగాహన లేకపోవడం, భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో వివిధ రూపాల్లో ప్రమాదాలకు దారి తీస్తోంది. పత్తి నిల్వ చేసినప్పుడు కనీస భద్రత చర్యలు తీసుకుంటే విద్యుత్, ఇతర ప్రమాదాల నుంచి రక్షించుకోవచ్చు. ఇటీవల కాగజ్‌నగర్, దహెగాం మండలాల్లో ప్రమాదాలు జరిగి పత్తి కాలిపోయింది.

జిల్లాలో జరిగిన సంఘటనలు

- గతేడాది జనవరి 2న మండలంలోని కన్నెపల్లి గ్రామంలో ఇంట్లో పిల్లలు దాగుడు మూతలు ఆడుతూ ఇంట్లో నిల్వ ఉన్న పత్తిలో అభిషేక్(12) అనే బాలుడు దాక్కొని ఊపిరాడక మృతి చెందాడు.
- గతేడాది జనవరిలో పెంచికల్‌పేట్ మండలంలోని బొంబాయిగూడ గ్రామానికి చెందిన రైతు రాములు ఇంట్లో నిల్వ ఉంచిన పత్తి విద్యుదాఘాతానికి గురై మూడు క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది.
- జనవరి 3న జైనూర్ మండలం మానికొలాంగూడ గ్రామానికి చెందిన ఆత్రం మారు అనే రైతు ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిల్వ ఉంచిన ఐదు క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది.
- ఈ నెల 5న కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన సంతోష్ అనే వ్యాపారి వద్ద నిల్వ ఉన్న పత్తికి ప్రమాదవశాత్తు నిప్పంటుకోగా సుమారు 10 క్వింటాళ్ల వరకు పత్తి కాలిపోయింది.
- ఈ నెల 6న దహెగాం మండలం గిరవెల్లి గ్రామానికి చెందిన కొతారి ఇస్తారి అనే రైతు ఇల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. దీంతో ఇంట్లో నిల్వ ఉంచిన 60 క్వింటాళ్ల పత్తికి నిప్పంటుకుంది.

అప్రమత్తత అవసరం..

- సాధ్యమైనంత వరకు పత్తిని ఇంట్లో నిల్వ చేయకూడదు. ప్రత్యామ్నాయం లేక నిల్వ చేస్తే జాగ్రత్తలు పాటించాలి.
- పత్తి ఉంచిన గదికి విద్యుత్ సరఫరా లేకుండా చూడాలి.
- విద్యుత్ తీగలను ఎలుకలు కొరకడంతో విద్యుదాఘాతానికి దారి తీస్తుంది. విద్యుత్ తీగలు తెగితే టేపును అతికించాలి. అలాగే వదిలేయకూడదు.
- బీడీలు, చుట్టలు, సిగరెట్లు తాగి ఆర్పకుండా వాటిని గది వద్ద పడేయకూడదు. ఇంట్లో దీపం, అగర్‌వత్తులు వెలిగించి ఆర్పకుండా బయటకు వెళ్తుంటారు. ఎలుకలు పత్తిని తీసుకెళ్లి పారేయడంతో అగ్ని ప్రమాదానికి ఆ స్కారం ఉంటుంది. బయటకు వెళ్తే ఆర్పి వేయాలి.
- ఎక్కువ రోజులు పత్తి నిల్వ చేయడంతో లోపల తేమ ఏర్పడుతుంది. దీనికి గాలి, వేడి తగిలి ఒక్కసారిగా అగ్ని పుడుతుంది. ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలి.
- ఇంట్లో చిన్నపిల్లలు పత్తి నిల్వ చేసిన కుప్పలవైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

అడ్డగోలుగా స్పీడ్ బ్రేకర్లు

- నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



బాపూనగర్‌లో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని రహదారులపై అడ్డగోలుగా, నిబంధనలకు విరుద్ధంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు సమీపంలో నూతన ఇళ్ల నిర్మాణం చేపట్టే వారు తమ ఇళ్ల ఎదుట ఇష్టారాజ్యంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటితో రోడ్లపై వెళ్లే వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.

ఇష్టారాజ్యంగా ఏర్పాటు..

రోడ్లపై అడ్డగోలుగా ఎత్తులో స్పీడ్ బ్రేకర్లు నిర్మించడంతో వాహనదారులు నానా తిప్పలు పడుతున్నారు. మహిళలు, వృద్ధులకు నిబంధనలకు విరుద్ధంగా ఎత్తుగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లతో శారీరక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. జిల్లా కేంద్రంలోని కసాబ్‌వాడీ, బాపూనగర్, జైన్‌మందిర్ లైన్, పొట్టిశ్రీరాములు చౌక్, బ్రాహ్మణవాడ, సందీప్‌నగర్ కాలనీల్లో అధిక సంఖ్యలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. నిబంధనలను తుంగలో తొక్కి పలువురు స్పీడ్ బ్రేకర్లు నిర్మించినా సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఆసిఫాబాద్ త్వరలో మున్సిపాలిటీగా మారుతున్న నేపథ్యంలో స్పీడ్ బ్రేకర్ల సమస్యతో పాటు, రోడ్ల విస్తరణ సమస్య పరిష్కరించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

గుంతలతో తిప్పలు..

జిల్లాకేంద్రంలో పలు రోడ్లపై ఏర్పడ్డ గుంతలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్‌ల కోసం రోడ్డును తవ్వి, పని పూర్తయిన తర్వాత సరిగా పూడ్చకపోవడంతో రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. ఇష్టారాజ్యంగా భారీ వాహనాలు, కార్, బైక్‌లను రోడ్లపైనే నిలుపుతుండడంతో పాటు రోడ్డుపైవరకు ర్యాంపుల నిర్మాణంతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గల్లీకి మూడు, నాలుగు..



పట్టణంలో ముఖ్య కూడళ్ల వద్ద మాత్రమే పరిమిత స్పీడ్ బ్రేకర్‌లు ఉండాలి. గల్లీకి 3 నుంచి 4 స్పీడ్ బ్రేకర్లు ఉండడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. శారీరక సమస్యలు సైతం తలెత్తుతున్నాయి.

\- మోతె మురళి, స్థానికుడు

అధికారులు పర్యవేక్షించాలి



జిల్లా కేంద్రంలో అధికారులు కనీసం ఆరు నెలలకోసారి పర్యవేక్షించాలి. అక్రమ ర్యాంపులు, పార్కింగ్, స్పీడ్ బ్రేకర్లను తొలగించేలా చర్యలు చేపట్టాలి. ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికారులు కఠినంగా వ్యవహరించాలి.

\- రవీందర్, స్థానికుడు

శబరిమల యాత్రకు బయలుదేరిన స్వాములు



పూజలు చేస్తున్న అయ్యప్ప స్వాములు

ఆసిఫాబాద్‌అర్బన్: పట్టణానికి చెందిన 20 మంది అయ్యప్ప దీక్షాపరులు మంగళవారం శబరిమల యాత్రకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీ హరిహర అయ్యప్ప స్వామి దేవాలయంలో గురుస్వామి మునునూరి సూర్య భాస్కరశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వాములకు ఇరుముడులు కట్టారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో స్వాములు యాత్రకు బయలుదేరారు. గురుస్వాములు వేణుగోపాల్, అశోక్, సంతోష్, గణేశ్ ఉన్నారు.

న్యాయసంహిత చట్టాన్ని ఉపసంహరించుకోవాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భారత న్యాయ సంహిత చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మంగళవారం కలెక్టర్ హేమంత్ బోర్కడేను కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని నేటి నుంచి హైర్‌బస్ డ్రైవర్లు సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. యాక్సిడెంట్ కేసులకు డ్రైవర్లకు పదేళ్ల జైలు, రూ.7లక్షల జరిమానా విధించడం దారుణమన్నారు. చట్టాన్ని ఉపసంహరించుకునే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హైర్‌బస్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు మధుసూదన్, వర్కింగ్ ప్రెసిడెంట్ బాలేష్, కార్యదర్శి షఫీ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన కేంద్ర న్యాయ సంహిత చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కమాన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు మేలు చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. చట్టంలో హిట్ అండ్ రన్ అంశాన్ని వెంటనే తొలగించాలని పేర్కొన్నారు. సింగరేణి కోల్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీ, ధర్నా కార్యక్రమాలకు బీఆర్‌ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమాల్లో యూనియన్ అధ్యక్షుడు స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, ఉపాధ్యక్షుడు లచ్చన్న, కార్యదర్శి బుచ్చన్న, రవి ప్రసాద్, నాయకులు శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ సందర్శన

లింగాపూర్: మండలంలోని కంచన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధి మూలగూడలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జన్ మన్ పథకం ద్వారా గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో ప్రతీ గిరిజనుడికి ఆధార్‌కార్డు అందించే చర్యలను జిల్లా యంత్రాంగం ముమ్మరం చేసిందని పేర్కొన్నారు. ఈనెల 15న ప్రధాని నరేంద్ర మోదీ దేశ వ్యాప్తంగా ప్రారంభించనున్న జన్ మన్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఎంపీడీవో జీఆర్ ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

హైమన్‌డార్ఫ్ స్మారక క్రీడలు ప్రారంభం

జైనూర్: గ్రామీణ యువత క్రీడల్లో రాణించేందుకే ఏటా హైమన్ డార్ఫ్ స్మారక క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ ఏపీవో ఆత్రం భాస్కర్, సర్పంచ్ కనక ప్రతిభలు అన్నారు. మంగళవారం మండలంలోని మార్లవాయి గ్రామంలో డార్ఫ్ వర్ధంతి పురస్కరించుకొని స్మారక క్రీడా పోటీలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ యువతకు క్రీడలతో శారీరకంగా, మానసికంగా ఉల్లాసం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏటీడీవో పురుషోత్తం, ఉప సర్పంచ్ సాయిత్రి ధర్మేందర్, కమిటీ సభ్యులు ఉన్నారు.

'తునికాకు సేకరణ నిలిపివేయడం సరికాదు'

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో పెద్ద పులి సంచారం సాకుతో తునికాకు సేకరణను నిలిపివేసే ఆలోచన చేయడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి కూశన రాజన్న రాజన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్ హేమంత్ బోర్కడేకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆసిఫాబాద్‌లో 12 యూనిట్లు, కాగజ్‌నగర్ డివిజన్‌లో 13 యూనిట్లు ఉండేవని పేర్కొన్నారు. వన్యప్రాణుల రక్షణ, ఇతర కారణాలను చూపుతూ యూనిట్లను తగ్గిస్తూ వస్తున్నారని తెలిపారు. ప్రజలకు వ్యవసాయం తర్వాత రెండో పంటగా, ఆదాయ వనరుగా ఉన్న తునికాకు సేకరణను రద్దు చేయాలని ప్రభుత్వానికి అధికారులు సిఫారసు చేయడం సరికాదన్నారు. 30వేల కుటుంబాలు ఆకు సేకరించి ఆదాయం పొందుతున్నాయని పేర్కొన్నారు. బీడీ పరిశ్రమ కూడా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తునికా సేకరణకు టెండర్లు పిలవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, సభ్యులు కార్తీక్ తదితరులు ఉన్నారు.

కోల్ ట్రాన్స్‌పోర్టు కార్మికుల వేతనాలు పెంచాలి



జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు

రెబ్బెన: సింగరేణి సంస్థలో పని చేస్తున్న కోల్ ట్రాన్స్‌పోర్టు కార్మికుల వేతనాలను పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం కోల్ ట్రాన్స్‌పోర్టు కార్మికుల సమ్మెలో భాగంగా గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణిలో ఎన్నో ఏళ్లుగా ట్రాన్స్‌పోర్టు కార్మికులు చాలీచాలనీ వేతనాలకే పని చేస్తూ శ్రమదోపిడికి గురవుతున్నారన్నారు. కార్మిక చట్టాల ప్రకారం కార్మికులకు కనీస వేతనాలతో పాటు ఇతర హక్కులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్‌వోటూజీఎం నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు స్వామి, తిరుపతి, లచ్చన్న, రవిప్రసాద్, సాగర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగికి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న సత్యనారాయణ

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో జనరల్ మజ్దూర్‌గా పని చేసి మెడికల్ ఇన్‌వ్యాలిడేట్ అయిన విశ్రాంత ఉద్యోగి అచ్చె సత్యనారాయణ ఉద్యోగాన్ని సంస్థకే వదిలేయటంతో సంస్థ లంసంగా అందజేసే డబ్బులకు సంబంధించిన చెక్కును మంగళవారం పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి విశ్రాంత ఉద్యోగికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ సత్యనారాయణ లంసం మొత్తం కోసం దరఖాస్తు చేసుకోగా యాజమాన్యం ఐటీని మినహాయింపు చేసుకొని రూ.19.15 లక్షలను మంజూరు చేసిందన్నారు. సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, జూనియర్ అసిస్టెంట్ బాబాలు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

కౌటాల: ఈ నెల 22న అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవం నేపథ్యంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను మంగళవారం మండల కేంద్రంలో భక్తులు భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. గ్రామంలోని ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీటీసీ మనీష్, బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్ గౌడ్, మండలాధ్యక్షులు వానుపటేల్, ప్రధాన కార్యదర్శి మిథున్, నారాయణ సర్కార్, తిరుపతిరెడ్డి, మధుకర్, గట్టయ్య, అనిల్ పాల్గొన్నారు.

పోలీసుల సూచనలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన: సంక్రాంతి పండుగ సందర్భంగా సొంత గ్రామాలకు వెళ్లే ప్రజలు పోలీసుల సూచనలు పాటించాలని ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పండగకు ఊర్లెళ్లే వారు తమ విలువైన బంగారం, వెండి ఆభరణాలను బ్యాంకు లాకర్‌లో భద్రపర్చుకొని వెళ్లాలన్నారు. ఊర్లెళ్లే సమయంలో సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, సీసీ కెమెరాలు సరైన విధంగా పని చేసేలా, కండీషన్‌లో ఉండేలా చూసుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తులు ఉదయం వేళల్లో రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతున్నారన్నారు. కాలనీలవారీగా గస్తీ దళాలను ఏర్పాటు చేసుకోవాలని, గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మేనేజర్ రాజేశ్వర్‌రావు

పెంచికల్‌పేట్: బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాజేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని లోడుపల్లి గ్రామంలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకులో ఖాతాదారులకు అందిస్తున్న ఇన్సురెన్సు సేవలు, రుణాలు, వ్యక్తిగత రుణాలపై వివరించారు. రుణాలు తీసుకున్న వారు సకాలంలో చెల్లించాలన్నారు. సర్పంచ్ జాజిమొగ్గ శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



నిరాహార దీక్షలో ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐఆర్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ మర్రి రఘువయ్య, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్, సికింద్రాబాద్ డివిజనల్ సెక్రెటరీ ప్రభురాజ్‌ల పిలుపు మేరకు మంగళవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సమస్యలను పరిష్కరించేంత వరకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఓపీఎస్ పునరుద్ధరించకపోతే ఎస్ఎఫ్ఐఆర్ ఆదేశాలకు అనుగుణంగా తీవ్ర నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. బ్రాంచ్ సెక్రెటరీ సతీశ్ నాయుడు, అసిస్టెంట్ సెక్రెటరీ సాంబయ్య, వైస్‌చైర్మన్‌లు తిరుపతి, జీవ రత్నం, వర్కింగ్ చైర్మన్ రాంకుమార్ మీనా, ట్రెజరర్ నర్సయ్య, అన్ని విభాగాల ఉద్యోగులు, ఇంజనీర్లు పల్గొన్నారు. కాగా ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ కాగజ్‌నగర్ బ్రాంచ్ సెక్రెటరీ సీహెచ్ విజయేందర్, శ్యామ్, మహేశ్, వెంకటప్ప, రఫీక్ తదితరులు మద్దతు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

బెజ్జూర్: మండలంలోని ఎలుకపెల్లి గ్రామానికి చెందిన జంగంపల్లి బానయ్య సోమవారం అనారోగ్యంతో మృతిచెందగా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆదేశాల మేరకు మంగళవారం బీజేపీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు సామల తిరుపతి, అన్నారం తిరుపతి, రాజు, వెంకటేష్, సాయిబాబా, విజయ్, ఇస్తారి పాల్గొన్నారు.